# కుప్పగా కూలింది వన్నెలి

జి. నరసింహారావు

ఆకాశంలో చుక్క పొడిచింది.

రాచవారింట్లో చుక్క వెలిసింది. నిండు మనసుల ముచ్చట తీరిందని సంబరాలు పోతున్న రాణిని చూసి వెన్నెల ఎగసిలేచింది.

చిన్నారి నవ్వులకు, సిరిమల్లె పూవులకు పోటీగా, ఒయ్యారి కులుకుల రాయంచ నడకలకుసాటిగా, రాచకులాన రాజనిమ్మపండు వన్నె కన్నె పిల్ల: గొల్లల దేవునికి మన సమ్మకున్న రాధమ్మ రాగంలా, అదేమి చోద్యమోగాని కొండె కిష్టయ్య సన్నిధి వదిలేదికాదు.

ఆడిన ఆటల్లో, పాడేపాటల్లో రాజగోపాలమూర్తి రాగాలకథలు లాస్యంచేసేవి. పెదవి చివరి విరుపుల్లో గోపాలస్వామి కొంటెదనం: కనులఆశ నాట్యంలో కాళియమర్దను లీలానృత్యం: ఆమె గోపాలుని మారురూపు, మరో రూపు అన్నట్లుండేది.

వెన్నెలలానే వయసు విచ్చుకుంటున్నకొద్దీ: రాచనగరులో రసిక రాజుల ఝుమాయింపెక్కువయింది. విల్లమ్ములు వదలి, పిల్లగాళ్ళు చినదాని కనుసన్నల నాశ్రయించిన సమయాన; అందానికీ, చందానికీ, అమ్మడే ఆది పునాది యని వలపు గాళ్ళు ఊసుల తేలియాడుతున్న నిముసాన:


రాచనగరంతా గుప్పుమంది—

'సంగీతం, సాహిత్యం జంటగా నేర్చిన చినవాడిదే జవరాలు' అని.

మాటవిని మనసు మార్చుకున్న మారాజులు మలిసందెకే యింటి మొహం పట్టిన వేళ: కళలతల్లి చల్లనిచూపుకు కరువులేని కోర్కెల పిల్లగాళ్ళు వంతుకోసం వేచియున్న వేళ: 'మలయమారుతం'తో పాన్పు పీడి, పూలసెజ్జలాంటి వడుచుపిల్ల స్వామివారిని చేరింది

కన్నుల్లో ఆశ, ఆవేశం, అనుతాపం రంగు లీనుతుండగా: ఓరకంట స్వామిని చూసింది. 'దేవా! ఏమి నీ సెల' వంది.

చిర్నవ్వు నవ్వాడు గొల్లడు.
వల్లెయని పిల్లది కదిలింది. పైట
చెంగు రెపరెప మంది
పడుచుదనం పెళపెళమంది
'దేవుని సెలవైంది. జంటగోరే
బంటుల్ని ప్రవేశపెట్టి'మంది
'అహో' యని వరాల మురిసి
బిరాన చనినారు చిన్నవాళ్లు.



వెన్నెలవేసిన ఉద్యానవనంలో, చుక్కలు సొగసుచూసుకునే సెలయేటి దాపున, అందాల ల్లినపూల పందిరిలో: పన్నజాజి పరిమళం లాంటి చిన్నదుంది. ఆశగా చూసే చెలికత్తె చెంతనే ఉంది.

వాతావరణం వయసు పిల్ల వలపు పాటలా ఉంది

మీసాల రోషాలు ఎగసే, రాచవాడు ముందు వచ్చాడు. కళలకుతను నెలవని పౌరుషంగా పలికాడు. చిన్నదాని మాటల్ని చెలికత్తె తెలియ చేసింది.

గీతం పాడమంది.

గొంతెత్తాడు పాట ఆపి పొమ్మంది. 'ఆరాధన లేని మనసులో ఆనందంఉండదు. ఆనందంలోంచి పుట్టే గీతంకన్నా అన్యంనాదెపుడు వినలేదు. సరిగమలు సంగీతం కాదు. రసావిర్భూతికి నాంది పలకలేని నీ పాట పరిమళం లేని పువ్వులాంటిది. ఇక వెళ్ళవచ్చు' అంది.

మరొకడొచ్చాడు. మనసైన చినదాని మమత దోచుకునే దొంగను తాను కావాలని, దాసుడిలా, వినయం పిల్లి ముగ్గులు వేస్తూంటే వచ్చాడు.

కవనంఅల్లమంది. నోరు తెరిచాడు.

చాలుచాలంది. అందని ఆశకై ఆశెందుకంది. గొల్లల దేవుని లీలా పారాయణ చేయనోపని నీ బ్రతుకెందుకంది. యమునకు అందని ఆనందాన్ని అందించి అలరించగల నేర్పులేని కవికి కవనమెందుకంది. ఛందంకాదు, పదబంధంకాదు, రసగంధం కవిత్వమంది. 'గోపాలుని

వేణువులో గొంతు విచ్చుకున్న బృందావన రాగాలకు కవి గుండె నెలవు కావాలి. రాధమ్మవారి కనుల్లో రంగు తీర్చుకున్న కలలకు కవిత్వం ఆలయంకావాలి; లేనినాడు నీ కవిత్వమెందుకు, కాసు కమ్ముకోనా!' అంది.

'సుందరమైన స్వప్నంలో సొబగుతీర్చుకుంటున్న భావాలు పూలవాకిళ్ళలో పిల్లగాలిలా నృత్యంచేసే రోజున కవిత్వం అమరత్వాన్ని సాధిస్తుంది చరాచర జగత్తులో సామూహికంగా సాగే రాగానురాగాల విపంచీ నినాదాలకు రూపం దిద్దగల నేర్పున్న నాడు కవి దేవుడవుతాడు. ఆ సిద్ధిసాధించుకొని రమ్మంది. పొమ్మంది.

దివసాలు గడిచాయి. కోటలో సన్నాయి పాటకోసం జనం చెవులు తెరుచుకున్నారు. ప్రయోజనం లేక పోయింది.

ఒచ్చేవారొస్తున్నారు. చిన్నదాని ఊహల ఉయ్యాలలోకి ప్రవేశానికి అవకాశం మాత్రం దొరకడంలేదు.

రాచనగరంతా ఈ పరుష ప్రవర్తనకు చిన్నపుచ్చుకుంది.

తెలవారితే వసంతోత్సవానికి నాంది పాడతారు. నగరంతా అలికిడిగా ఆనందంగా ఉంది.

చుక్కలు హెచ్చుగా విచ్చుకున్న సమయాన, దూరంగా కొండల్లోంచి, ఏదో మధురనాదం, ప్రకృతి గుండెల్ని పులకరింపచేస్తూ, జాహ్నవిలా ప్రవహించి పోతూంది. ఆ గానానికి ఆద్యంతాలు, చావు పుట్టుకలు లేవులా ఉంది.

పిల్లగాలులు పాటను పదుచు గుండెలకు అందేలా చేస్తున్నవేళ: పట్టుపానుపుమీద పవళించిన పసిడి బొమ్మ మనసుచెవుల్లో ఎవరో గుసగుసలాడి నట్లయింది. ముద్దుల చప్పుళ్ళు, చిలిపి పలకరింపులు పడుచుపిల్ల వయసుకి తోచినాయి.

కలల లోకాల చిన్నది లేచింది.
చూసింది.
అంతఃపురంలో వెన్నెల తప్పించి
మరోటి నిదురమాని లేదు.
చెవులు రిక్కించింది. హృదయం
తెరచింది.
ఏదో పిలుపు రారమ్మని.
'ఏమా!' అని చూస్తే అంతా
వెన్నెలే!

'వెన్నెల వేళ వెదురు పొదల రొదకాదుకదా!' అనుకునేటంతలో: ఇంకా మోహనంగా: మంజులంగా: వలపుకత్తె గుండెలు ఝల్లుమన్నట్లు: తిరిగి ఏదో పిలుపు. కోమ్మగా: గోపాలదేవుని ఎంగిలి పెదాలంత!

వ్రజవనితల వయసు మురిపం లాంటి వెన్నెల మాత్రం నగ్నంగా. తిరిగి 'రావూ! రావా! రాలేవు కదూ!' అన్నట్లుగా పలికే పాట.

నౌకాదళంలో కొత్తగా చేరిన వారికి ఈతలో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో ఒక ముఖ్యమైన అంశం పదిహేను అడుగుల ఎత్తునుంచి నీళ్ళలోకి దూకడం.

ఒక యువకుడు తను అంత ఎత్తునుంచి దూకలేనన్నాడు.

అధికారి కోపంగా 'నువ్వు ఎక్కిన నౌక మునిగిపోతోందనుకో. నువ్వు పదిహేను అడుగుల ఎత్తున వున్నావనుకో. ఏం చేస్తావ్? అని అడిగాడు.

'నౌక ఇంకో పది అడుగులు మునిగేదాకా ఆగుతాను' అని సమాధాన మిచ్చాడు యువకుడు.

---

పాటకు పదాలు లేవు: రాగం ఉంది. రాగంలో రేగే భావం ఉంది.

ఆశగా చూస్తే: అంతా వన్నెల వెన్నెల. నీడ జాడలేదు.

"మనసులోని మధురమైన మనసు పిలుపు వినవా! వయసుకి గంధం పూయాల్సినవాడు: కొండల్లో కోనల్లో; సమాధిలో కూర్చుని: సాగించే రాగరసవాహిని పడి రాలేవా? లోకాలకు ఎల్లలు కానీ కలల లోకాలకు కాదు! ఓ... మధుర ప్రణయినీ..ఆశల ఆకాశంలో అల్లినవెన్నెల కావ్యంలో 'కుహూ' అన్న భావంలాంటి ఓ సౌదామినీ! రాలేవా!" అన్నట్లుగా పలికేరాగం.

చిన్నదానికి ఊరటలేదాయె! "ఏల ఈ రేయి ఇంత వింత పిలుపుల నెగబోస్తూంది. ఏ దేవుడి చల్లని దీవెన, ఏ వలపుల గాలుల వీవన: ఈ రమ్మను కమ్మని తెమ్మెర పిలుపులు. ఏమాయిది?" అని చిన్నది రిచ్చపడి నిల్చుండిపోగా,

"మరీ అంత మోమోటమా! ఆకాశంలో చుక్కల నడుగు: వెన్నెలయేట్లో విరిసిన జాబిలి పువ్వు నడుగు. నవ్వేపెదవుల నడుగు. చల్లగాలిని అడుగు. పిల్ల ఆశను అడుగు. నేనెవరో చెబుతారు. మరో సారి మన కోసం రాని వెన్నెల ఊరిస్తుంటే ఊరుకుంటున్నావా? మరి రావా! కోర్కెల బాటల మీదుగా సాగిరా!... ఆశల వెలుతుర్లో, అందంలా ఆనందంలా:రా... రా..రా...

ఒకే రాగంలో కులికే పిలుపుకి గుండె ఒక దెసకు అడుగు వేస్తోంది. అయినా ఏదో బంధం వెనక్కు లాగుతూంది.

ఈసారి మరి తాళలేక పోయింది చిన్నారి. పరువంలో వీణలు పలుకుతున్నాయి. గుండెల్లో వసంతాలాడుకుంటున్నాయి వెన్నెలలు. గాలి తాకిడిచే విచ్చుకున్న పరిమళాలు వయసు మనసుని తొందర పెడుతున్నాయి.

అడుగు ముందుకు వేసింది. ఆగి పోయింది.

రావు కదూ! నీ ఆశతో నా యీ జీవన దీపం వెలిగించవు కదూ! స్వాప్నికంగా సాగే యీ గానం దెసకు పరుగు తీయవు కదూ! ఇక్కడ వెన్నెలలేదు.. వేడిలేదు... ఊపిరిలేదు... ఉత్సాహంలేదు. ఉన్నదంతా తర తరాల అనురాగాల ప్రవాహం.

ఇక్కడ ఆవేదనలేదు: ఆవేశం లేదు...

ఉన్నదంతా జీవనరాగ తరంగాల మీద నీతో ఉయ్యాలూగాల్సిన నేను మాత్రమే... ఇక్కడ శరీరంఉండదు— స్వార్థం ఉండదు.

ఉండేదంతా...ఒకే ఒక జంట మనసు మమత మాధురి... రాఁ... రాఁ... రాఁ...'

ఆశలా, ఆవేశంలా పరుగులు తీసింది ఒయ్యారి. పాట జగమంతా పున్నాగపరిమళంలా నిండిపోతూంది.

పరుగుతీస్తూనే ఉంది ఒయ్యారి. గుండెలు నిదురవిడి ఊగిపోయేటట్లు మరీ మరీ మధురంగా: అర్థంకాని సందేహాన్నందించే ఆ పాట: సాగి పోతూనే ఉంది.

చుక్కల లోకాల దెసకు, చిక్కని రాగాల బసకు, పరుగులుసాగిస్తూనే ఉంది మిటారి...

తెల తెల వారుతూంది.

వేకువ కాంతుల్లో ఊరవతల నదిలో. వెన్నెల కుప్పగా కూలి పోయి, మునిగిపోయి: చిక్కని బంగారు కిరణమై నింగి కెగిరి పోయింది.

□□□

